# చురక

'నీవు భారత స్త్రీవి. నీలో అంతర్గతంగా ఓ 'అమ్మ' దాగివుంది. ఆవిడ నిన్ను గిలిగింతలు పెట్టిననాడు, అమ్మవు కావాలన్న ఆకాంక్ష మొలకెత్తిననాడు నిన్నది జోరీగలా వెంటాడుతుంది అనుక్షణం. ఈ లోనిజోరీగను శాంతింపజేసి తల్లివిగా అవతారమెత్తడానికి పెండ్లి తప్పదు. నీవు భారతనారివి కనుక ఆ మనోవాంఛ ఏ క్షణాన పుట్టుకొస్తుందో ఎవరూ చెప్పలేరు'.

ఈ వాఖ్యలలో ఎంత ముందుచూపు వుంది. ఎంత నిజాయితీ ఉంది. ఎన్ని తరాల స్త్రీలను నిశితంగా పరీక్షించి చెప్పిన అమృత సందేశం.

టెలిఫోన్ రింగ్ అవుతోంది. నేను ఆలోచనలో పడి పట్టించుకోలేదు. ఇంతలో పాప బావురు మంది. నేను బాహ్యజగత్తులోనికి వచ్చాను. నా ఒడిలోనికి తీసుకోగానే అది ఆరున్నొక్క రాగాన్ని నిలిపివేసి నన్ను చూసి బోసినవ్వు నవ్వింది.

ఆ నవ్వుకోసమా స్త్రీ జన్మనెత్తినది. మళ్ళీ టెలిఫోన్ మోగింది. అవతల శ్రీవారు. నేను ఎంతసేపటికీ ఫోన్ ఎత్తకపోతే కలవరపడ్డారు.

"మీకన్నిటికీ గాబరాయే. పాపాయి ఏడుస్తుంటే టెలిఫోన్ తీయలేకపోయాను" అంటూ ఓ అబద్ధం చెప్పాను. ఫోన్‌లో సంభాషణ అయిన తరువాత నా ఆలోచనలు గతంలోకి వెళ్ళాయి.

★ ★ ★

అసలు నా జీవితంలో ఈ సుందరమయిన మలుపు ఎలా వచ్చింది?

భారతి....

ఆమెను కలిసి వుండకపోతే... ఆమెదగ్గర సెలవు తీసుకొని బయలుదేరుతూ వుంటే "శారదక్కా! మీకు త్వరలోనే పెళ్ళి అవుతుంది. దేశం పెళ్ళికొడుకులకు గొడ్డుపోలేదు" అంది నవ్వుతూ.

ఆమె అలాగెందుకంది? పదినిముషాలక్రితం "మీరేనా శారదగారు" అంటూ మాట కలిపింది. ఇప్పుడు వరుస కలిపింది.

నేను పెళ్ళికోసం తపించుకుపోతున్నానని ఆవిడకెవరు చెప్పారు? కొన్ని కొన్ని సంఘటనల తరువాత పెళ్ళి చేసుకోరాదనే అనుకున్నాను. తల్లిదండ్రులు ఎంతగా ప్రాధేయపడినా నా నిశ్చయాన్ని మార్చుకోలేదు.

నాపేరు భారతి అని ఆమె చెప్పింది. వయసులో నాకంటే రెండు మూడేళ్ళు చిన్నది. ఆమె చంకలో నాలుగేళ్ళ పాప. ముద్దొస్తున్నది.

దాని బుగ్గమీద చిటికె వేశాను.

విచిత్రంగా కలిశాం. బట్టలషాపులో అమ్మకు చీర కొన్నాను. బిల్లు చెల్లిస్తుంటే "మీరేనా శారద

గారు" అంది. నేనామెను గుర్తుపట్టలేకపోయాను. "ఔను నేను శారదనే. ఇంతకీ మీరెవరు?" అన్నాను.

"ఎన్నాళ్ళనుంచో మిమ్మల్ని చూడాలనుకుంటున్నాను. ఇన్నాళ్ళకు ఆ భాగ్యం కలిగింది." సంతోషంతో ఆమె ముఖం విప్పారింది.

నాకు నవ్వు వచ్చింది. ఎవరిని చూసి ఎవరనుకున్నదో, నన్నుచూసి ఆనందపడవలసిన కారణాలు లేవు. నాకే కళలలోనూ ప్రవేశం లేదు. మామూలు ఉద్యోగినిని.

"నన్ను చూసి మరెవరనుకుంటున్నారో, నన్ను గుర్తుంచుకోవలసిన అంశాలు నాలో ఏమీలేవు. నేను సాధారణ ఉద్యోగినిని. మీకు కావలసిన శారద వేరే ఎవరో అయి ఉంటారు."

"మీకు నేనెవరో తెలియదు. నిజమే. నేను ఈనాడు ఇంత సంతోషంగా ఉన్నానంటే అది మీరు పెట్టిన భిక్షే. ఎంతో కాలంగా మిమ్మల్ని కలియాలనుకుంటున్నాను. వెతకపోయిన తీగ కాలికి తగిలిందంటారు. నా భాగ్యం కొద్దీ మీరిక్కడ తారసపడ్డారు. మీ ఫోటోను నేను రోజూ చూస్తూ ఉంటాను"

నాకు ఆశ్చర్యమూ సంభ్రమమూ వేశాయి.

ఏదో ఉపకారం చేసి వుంటాను నా వృత్తి ధర్మంగా. అయితే ఆమె ఎప్పుడూ నన్ను ఆఫీసులో కలిసినట్లుగా గుర్తులేదు. "చెప్పండి. నాతో ఏదైనా పనివుందా? వాగ్దానం చేయలేను. కాని అవకాశం వుంటే తప్పక చేస్తాను" అన్నాను.

"నిజంగానా! అయితే ఇప్పుడు మీరు మా ఇంటికి రావాలి" అంది నవ్వుతూ.

"మీ ఇంటికా? ఎందుకు? ఆ చెప్పవలసినదేదో ఇక్కడే చెప్పండి. మాట ఇచ్చాను. వీలైతే చేస్తాను"

"పెద్దగా పనిలేదు. మీతో అయిదు పది నిముషాలు మాట్లాడాలని మనసుగా ఉంది. ఇక్కడ బాగుండదు" అన్నదామె.

నాకు అనుమానం వేసింది. ఆమె ముక్కూ ముఖం తెలియదు. ఏ పాపకూపంలోకి లాగుతుందో? ఇలాంటివెన్నో జరుగుతున్నాయి. తన మంచిమాటలతో ఇంటికనిచెప్పి ఏ బ్రోతల్ హౌస్‌కైనా తీసుకుపోతుందా? లేక ఏ దుర్మార్గులకైనా అమ్మివేస్తుందా? ఆమె చంకలోని పాప ఆమె స్వంత బిడ్డ కాకపోనూవచ్చు. ఆమె ఆడే నాటకంలో ఒక బాలపాత్రధారి కావచ్చు. ఏ పుట్టలో ఏ పాముందో? ఎవరినీ అంతగా నమ్మకూడదు.

మనిషి ముఖం చూసి కొందరు ఎదుటివారి ఆలోచనలు పసిగట్టగలుగుతారు. ఆమెకు నా ఆలోచనా సరళి బోధపడి ఉంటుంది. ఆమె నెరజాణ. బాగా శిక్షణ పొంది ఉంటుంది.

"మీరేం ఆలోచిస్తున్నారో నాకు అర్థమైంది. నేను మీరు ఊహిస్తున్నట్లు నీచపుదాన్ని కాను. నేను సంసారస్త్రీని. నా పెళ్ళికి కారకులు మీరు, మా ఇల్లు శివాలయం వీధిలో బ్యాంకు పక్కన ఉంది. మావారు టూర్ మీద వెళ్ళారు. ఇంటికి తాళం వేసి వచ్చాను. ఇప్పుడు నమ్మకం కుదిరిందా?"

అనవసరంగా ఆమెను అనుమానించాను. అబలను కాబట్టి భయపడ్డాను. శివాలయంవీధి నాకు తెలుసు. అక్కడ అందరూ గౌరవప్రదంగా బ్రతుకుతున్నవారే. బ్యాంకు పక్క యిల్లు. ఆ వీధి నిర్మానుష్యంగా ఉండదు. చీకటి పడడానికి ఇంకా నాలుగు గంటలుంది.

"పదండి" అన్నాను.

బయటవెళ్తున్న ఆటోను ఆపి నేనే బేరంచేసి అందులో ఎక్కాను భారతితో. తాళం తీసింది.

ముందు పెద్ద డ్రాయింగ్ హాల్. నన్ను ఒక సోఫాలో కూర్చోపెట్టి పాపను పక్కనే మరో సోఫాలో పడుకోపెట్టి లోనికి వెళ్ళింది. తిరిగి వచ్చినప్పుడు స్వీటుతో ఒక ప్లేటూ మంచి నీళ్ళూ తెచ్చింది.

"తీసుకోండి. వేళగానివేళ. ఇది భోజనాలవేళ కాదు. మీరు మా ఇంటిని పావనం చేశారు. సంతోషం"

నాకేవీ తినాలనిపించలేదు. "చెప్పండి. నాతో ఏం చెప్పదలచుకున్నారో"

"ఆ ఫోటో చూశారా? అందులో మీరున్నారు" అంది గోడమీద గ్రూప్‌ఫోటోను చూపించి.

"నేనెవరినో మీరు పోల్చుకోలేదు. మా వెడ్డింగ్ కార్డు నా భర్తగారు మీకు పంపారు"

నాకు అసహనంగా ఉంది. ఎందరో వెడ్డింగ్ కార్డులు పంపిస్తారు. కొన్ని పెళ్ళిళ్ళకు వెళ్ళగలం. ఈ అమ్మాయి పెళ్ళికి వెళ్ళలేదు. ఏ శుభలేఖో ఎలా గుర్తుంటుంది?

"నేను శంకరంగారి భార్యను" అంది నవ్వుతూ.

అయినా స్ఫురణకేమీ రాలేదు. శంకరం, ఆపేరు ఎందరెందరికో ఉంటుంది. అందులో ఏ శంకరం భార్య ఈమె? అయితే ఒకటిమాత్రం నిజం. 'శంకరం! నువ్వు ఈ పిల్లను చేసుకో' అని ఏ శంకరానికి నేను రికమెండేషన్ చేయలేదు. అసలీమె ఎవరో నాకు తెలియనే తెలియదు.

"నేను ఓడిపోయాను. వివరంగా చెప్పండి"

"నన్ను మీరు మన్నించకూడదు. వయసులో చిన్నదాన్ని. శంకరం పేరు వింటే మీకు అంతా గుర్తు వస్తుందనుకున్నాను. పోనీ మరో క్లూ ఇస్తాను'

ఇది ఏమైనా క్విజ్ పోటీయా? బహుమతి వుంటుందా? నాకు నిజంగా కోపం వచ్చింది. నా జ్ఞాపకశక్తిని పరీక్షించే అధికారం ఈమెకెవరిచ్చారు?

"రిస్టువాచీ శంకరంగారు. బాపట్లలో మీతోపాటు పనిచేశారు కొంతకాలం" నవ్వుతూ అందామె.

"ఓహో! అతనా?" అన్నాను. అయినా ఆ పిల్ల వరుస నాకేం నచ్చలేదు. శంకరాన్ని పెళ్ళాడడానికి నేను ఇష్టపడలేదు. తాను పెళ్ళాడింది. నన్ను అవమానించడానికా ఇంటికి పిలిచింది?

"ఎంత కట్నం ఇచ్చారు? లక్షా, ఇంకా ఎక్కువా? రిస్టువాచీ కాకుండా ఫ్రిజ్, మోటర్‌సైకిల్, వాషింగ్‌మిషన్ ఇచ్చారా? అత్తగారు, ఆడబడుచు లాంఛనాలెంత?" అని అడిగాను.

"సరిగ్గా పోల్చుకున్నారు"

నాకు గతం గుర్తుకొచ్చింది.

★ ★ ★

అప్పటికి నేను ఉద్యోగంలో చేరి ఆరు నెలలైంది. మాది సంపన్నమైన కుటుంబమే. నాకు ఉద్యోగం చేయవలసిన అవసరం లేదు. డిగ్రీ పూర్తి చేశాను. మావాళ్ళు నా పెళ్ళికి తొందరపడుతున్నారు. మొదటి ప్రయత్నంలోనే జాబ్ దొరికితే అది సంతోషానికి ఎంత హేతువౌతుందో మాటల్లో చెప్పలేము. నేను చేరిన ఆరు నెలలకే శంకరరావు మా ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ మీద వచ్చాడు.

ఇంకా చిన్నవాడు. పెళ్ళయిందో లేదో తెలియదు. మనిషి అందంగా ఉంటాడు. పెళ్ళికాని పిల్ల ఇలాంటివాడు భర్తగా దొరికితే ఎంత అదృష్టం అని అనుకుంటుంది. అతనికి నా పక్కనే సీటు కేటాయించారు.

ఈనాడు మోడుబారిన జీవితం జీవిస్తున్నానంటే అందుకు శంకరరావు ఒకవిధంగా కారణం. నేను అతను వచ్చిన దగ్గరనుంచి గమనిస్తున్నాను. తనపనేదో చేసుకుపోతాడు. కొత్తగా వచ్చాడు.

నలుగురితో పరిచయాలు పెంచుకోవాలనుకోడు. ఒంటరి సొంరికాయ.

అతనిలో ఒక గుణం నాకు నచ్చలేదు. శారదగారూ! టైం ఎంతని అడుగుతాడు. ఒకసారి టైం అడుగుతే అది తప్పుకాదు. ఆఫీసులో పని చేసేది రోజులో ఆరుగంటలు మాత్రమే. అతను రోజుకి కనీసం పదిమార్లు టైం అడుగుతాడు. అదే నాకు చిరాకు కలిగించేది. వారంపదిరోజులు ఓర్పుగా అతనికి చెప్తూ వచ్చాను. అతను టైం గురించి అంతగా ఎందుకు అడుగుతాడు? నాతో స్నేహం పెంచుకోవాలనా? మరి ఇతర విషయాలు అడగడేం?

"మాటిమాటికీ మీకు టైమ్ ఎందుకండీ? మనం ఆఫీసుకి వచ్చి నిండా అరగంట కాలేదు" అన్నాను కొంచెం కోపంగానే.

అతను నవ్వేడు. వెకిలినవ్వు కాదు. బోళానవ్వు.

"మీరు ఆ మాట అడుగుతారని, నాకు తెలుసు. నేను ఇంతకుముందు పనిచేసే ఆఫీసులో నాకెదురుగా గడియారం ఉండేది. తల ఎత్తితే టైమ్ తెలిసేది. అదిగో అలా అలవాటైంది. టైమ్ తెలియకపోతే నా చేతిలో కలం కదలదు. అది నా బలహీనత కాబోలు"

రిస్టువాచీ ఖరీదు మహావుంటే రెండు మూడు వందలుంటుంది. అతనికి మంచి జీతమే వస్తుంది. బహుశా ఇంటి పరిస్థితులు బాగులేవేమో?

ఆరోజు ఆ విషయం తేల్చుకోవాలనుకున్నాను. మీకు జీతం ఎంత వస్తుంది అని అడిగాను. అతను మళ్ళీ నవ్వేడు. జీతం అడిగితే నవ్వుతాడేం? "ఆడపిల్ల వయసు మగాడిజీతం అడగకూడదంటారు. అయినా చెప్తున్నాను" అతని జీతమెంతో గ్రాసూ, నెట్ రెండూ చెప్పాడు. మంచి జీతమే, కోతలు కూడా అతితక్కువ.

"మీకు తల్లిదండ్రులున్నారా? మీ నాన్నగారు ఏం చేస్తున్నారు?"

అతనికి తల్లిదండ్రులున్నారు. తండ్రి రైల్వేలో పనిచేస్తున్నాడు. జీతమేకాక పైరాబడి బాగా ఉంటుందట. వారికో పెద్ద ఇల్లు ఉంది. ఒక పోర్షను అద్దెకిచ్చారు. మంచి అద్దె. అతనికొక అక్క ఉంది. ఆమెకు పెళ్ళి జరిగింది. ఇతనొక్కడే మగసంతానం. శంకరరావుకి ఇంకా పెళ్ళికాలేదు. అందువలన పిల్లాపాపా లేరు. వారిది సంపన్నకుటుంబమేనని డబ్బుకి లోటులేదని ఒప్పుకున్నాడు.

"చీటికి మాటికి ఎవరినో టైమ్ అడగడానికి మీకు సిగ్గుగా లేదా? మూడువందలిస్తే మంచి వాచీ వస్తుందే" చురకవేశాను. అతను సిగ్గుపడలేదు. మళ్ళీ నవ్వేడు. నవ్వుతే నవరత్నాలు కురిశాయి అంటారు. ఈ సామెత కేవలం ఆడవారికే వర్తిస్తుందో పురుషులకు కూడా వర్తిస్తుందో నాకు తెలియదు. ఆ నవ్వులో అంత అందం ఉంది. తనను ఒకరు హర్ట్ చేశారన్న చిరుకోపం కూడా లేదు.

ప్రశ్న సామాన్యమైనది అయినా కొందరు జవాబు చెప్పడానికి కొంత టైమ్ తీసుకుంటారు.

"అడిగారు కాబట్టి చెప్తున్నాను. నా మనసులోని భావనను ఇంతవరకు ఎవరికీ చెప్పలేదు" అతను ఒక్క క్షణం ఆగి మళ్ళీ టైమ్ అడిగాడు.

"ఆఫీస్ అవర్స్ అవడానికి ఇంకా గంట వ్యవధి ఉంది. మీరేదో చెప్తానన్నారు. చెప్పడం ఇష్టంలేకపోతే..." నా మాట పూర్తికానివ్వలేదు.

"నాకు పెళ్ళి అవలేదని చెప్పానుగా, పెళ్ళిలో మా మామగారు ఎలాగూ రిస్టువాచీ ఇస్తారు. అప్పుడొక వాచీ ఉపయోగం ఉండదు" అన్నాడు.

ఆలూలేదు చూలూలేదు కొడుకుపేరు సోమలింగం. ఎప్పుడో ఎవరో ఏదో ఇస్తారని అవసరమైన

వాటిని కొనుక్కోవడం మానేస్తామా?

"ఇంకా ఏమి ఇస్తారు మీ పెళ్ళిలో అత్తవారు" ఎగతాళిగా అడిగాను. "ఒక స్కూటరు, ఒక ఫ్రిజ్ కొనిపించుకుంటాను. వాషింగ్‌మిషన్‌కోసం పట్టుపట్టను. దాని అవసరం ఆడవాళ్ళకే".

నాకు కంపరం పుట్టుకొచ్చింది. ఎంతెంత గొంతెమ్మ కోరికలు. కట్నంమాట అడిగితే అది పెద్దవాళ్ళ వ్యవహారం అన్నాడు. అయితే తన ఖరీదు ఒక లకారం వుంటుందన్నాడు.

అతనిమీద జుగుప్స కలిగింది. ఇంతకన్నా అమానుషం ఉంటుందా? అవతలివారు ఎన్ని అవస్థల పాలవుతారు. ఆడపిల్లల పెళ్ళిళ్ళతో ఎందరి సంసారాలు చితికిపోతున్నాయి. నాకు అతడికో పాఠం చెప్పాలనిపించింది.

"మీరు కోరినకట్నం కానుకలు ఇస్తే అందవికారినైనా మీరు చేసుకుంటారా?"

"అదెలా కుదురుతుందండీ?! నాకేం తక్కువ?"

అతనన్నమాట నిజమే.

"మీరు నలకూబరుడిలా ఉంటారు" అన్నాను.

అతనికలాంటి వికృతమైన కోరికలు లేకపోతే నేనతడ్ని చేసుకునేదానిని. అప్పుడు నా మనసులో ఓ ఆలోచన మెదిలింది. అది నా జీవిత గమ్యాన్ని మార్చింది. ఇప్పుడు వగచినా ప్రయోజనం లేదు.

"నేనెలా వుంటాను?" నవ్వుతూ ప్రశ్నించేను. ఆ నవ్వు వెనుక గూడుపురాణీ ఉందని ఆ అమాయకుడు తెలుసుకోలేదు.

"మీకేమండి కలహంసలా వుంటారు. అపరంజి బొమ్మలా ఉంటారు. ఇది ముఖస్తుతి కాదండీ! మీరు కోపగించుకోనంటే ఒక మాట చెప్తా"నన్నాడు.

"మాట చెపుతాను అంటే నేనెందుకు కోపగించుకుంటాను? నేను దుర్వాసమునికి వారసురాలిని కాను" అన్నాను.

"మీలాంటి అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలని వుంది" అన్నాడు. మిమ్మల్ని చేసుకుందామని వుంది అని డైరెక్టుగా అనలేకపోయాడు పాపం.

"మీ కాంప్లిమెంట్‌కు థాంక్స్. మిమ్మల్ని చూస్తే నాకూ అలాంటి కోరికే కలిగింది" అన్నాను.

"మా నాన్నగారికి ఫోన్ చేస్తాను" అన్నాడు. "మరి నా కోరికలు మా వాళ్ళడిగే కట్నం..."

"మీరు మీ నాన్నగారికి ఫోన్ చేయడం కాదు. వారి అడ్రసు ఇవ్వండి. మా నాన్నగారే స్వయంగా మీఇంటికొచ్చి పెళ్లిచూపులకు పిలుస్తారు. అది సాంప్రదాయం" అన్నాను.

అనుకున్న ప్రకారం వాళ్ళు వచ్చారు. పెళ్ళిచూపుల కార్యక్రమానికి కావాలనే మా ఆఫీస్ స్టాఫ్‌లో కొంతమందిని పిలిచాను.

మా ఇరుగుపొరుగు వారూ వచ్చారు.

"ఇది మా అబ్బాయీ మీ అమ్మాయి కలిసి నిర్ణయించుకున్న సంబంధం. పెద్దలమని మన గౌరవం కాపాడారు. మా కోరికలేమిటో మావాడు మీ పిల్లకు చెప్పాడు. మీరు మా ఇంటికి వచ్చారంటే మీరు వాటికి సిద్ధంగా ఉన్నట్లే కదా? పనిలో పనిగా తాంబూలాలు పుచ్చేసుకుందామా?" శంకరం నాన్నగారు మా నాన్నతో అన్నారు.

"చిన్నపిల్ల అదేం విందో, మాకేం చెప్పిందో, మీ నోటితే మరోమారు చెప్పండి" అన్నారు

మా నాన్న. శంకరం నాతో చెప్పినవన్నీ చెప్పారతను. వాషింగ్ మిషన్ కూడా వుంది. పోతే అత్తగారు ఆడబడుచుల లాంఛనాలు చెరి పదివేలూ చేర్చారు.

"ఈ లాంఛనాల సంగతి మా అమ్మాయి చెప్పలేదు" అన్నారు మా నాన్న.

"చెప్పివుండదులెండి. ఈ రెండు లాంఛనాలూ మినహాయిస్తే మా ఆడవాళ్ళు వూరుకోరు. వారికి ముచ్చట జరిగేదెప్పుడు? మీకు కష్టంగాతోస్తే కట్నం ఎనభైవేలివ్వండి. లెఖ్ఖ సరిపోతుంది" అన్నా రతను.

మా నాన్నగారు సిద్ధపడిపోయారు. అయితే నా అభిప్రాయం మరోమారు అడిగారు. అప్పుడు నా పాత్ర రంగప్రవేశం చేయవలసిన సమయం వచ్చింది.

"ఆడపిల్ల అదేం చెప్తుంది. ముందే తనకు శంకరం నచ్చాడు అంది" మా ఆఫీసులో పనిచేస్తున్న ఒకామె అంది.

"అతన్ని పెళ్ళిచేసుకోవడం నాకు ఇష్టంలేదు. కట్నకానుకల వ్యవస్థ అంటే నాకు రోత. ఆడపిల్ల అయినా మగపిల్లాడు అయినా ఒకేలాగ తల్లిగర్భంలోంచి పుడతారు. ఆడపిల్లలు అంత చులకనా? వారిమధ్య ఈ వ్యత్యాసం ఏమిటి? అప్పనంగా కొన్ని లక్షలు ఆడపిల్లవారినుంచి గుంజడానికి వారికి ఏం అధికారం ఉంది? ఇది నిలువుదోపిడీ కాదా?" అన్నాను.

అందరూ స్థాణువుల్లా కూర్చున్నారు. ఎవరూ పెదవి విప్పి మాట్లాడలేదు.

ముందుగా శంకరం తల్లిగారు తేరుకున్నారు.

"అమ్మా శారదా! కట్నం పుచ్చుకోవడం నీ దృష్టిలో నేరం కావచ్చు. అయితే నలుగురిలో మమ్మల్ని అవమానపరిచే అధికారం నీకెవరిచ్చారు? మా కోరిక జుగుప్సాకరమైనదే కావచ్చు. కాని మేం మిమ్మల్ని ఏమీ బలవంతం చేయలేదు. మేమూ ఆడపిల్లకు పెళ్ళిచేశాం.

ఆడపిల్లలున్న ప్రతీ గృహస్థుకు ఈ ఈతిబాధలు తప్పటంలేదు. నీది సంస్కరణమార్గమైతే ప్రజలను చైతన్యం చెయ్యి. నీ కాళ్ళమీద నీవు నిలబడగలవన్న అహంకారం నీకు ఉంది.

స్త్రీ స్వశక్తిమీద నిలబడాలి. కాని అహంకారం పనికిరాదు. ఆడపిల్లకు సిగ్గే సింగారం. దురుసుతనం అసలు పనికిరాదు. ఈ పెళ్ళిళ్ళకు నీవాలోచించే కారణమే కాక వేరే కోణం ఉంది. అవన్నీ నేను వివరించి చెప్పను. జీవితమనే పాఠశాలలోనే నీవు తెలుసుకుంటావు.

నీవు మాకు చురక వేయాలనుకున్నావు. నలుగురిలో మమ్మల్ని కించపరచాలనుకున్నావు. అందులో నీవు సఫలీకృతంకాలేదు. కాలేవు. ఇక్కడకు వచ్చినవారు నీ ధైర్యాన్ని మెచ్చుకొని భేష్ అంటారు. నిన్ను శ్లాఘిస్తారు. ఆ సంతోషం ఎంతసేపు నిలుస్తుంది? కన్నవారి ఆందోళన నీకు తెలియదు" అన్నదామె.

నేను మంచి చురక వేశాననుకున్నాను. ఆ చురక నాకే తగిలిందా? ఇప్పుడాలోచిస్తే శంకరంతల్లి చెప్పింది ఎంతో యదార్థమనిపిస్తున్నది.

★ ★ ★

"అక్కా! ఏమిటాలోచిస్తున్నావు? ఆనాడు మా అత్తగారన్న మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయా? ఉహూ నువ్వంత బేలవుకాదు" అంది భారతి.

"భారతీ! నిజం చెప్పు. మీవాళ్ళు వారడిగినంత కట్నం ఇచ్చారా? లేక వారు కిందికి దిగివచ్చారా? నీలాంటి ఆడపిల్లల వలననే వ్యవస్థ మారడం లేదు" అన్నాను.

"శారదక్కా ఇది నీవు పెట్టిన భిక్షే అన్నాను గుర్తుందా? నీ కారణంగానే నేను ఈనాడు సుఖమయ దాంపత్య జీవితం అనుభవిస్తున్నాను.

నీవు పొరపాటు పడుతున్నావు. మీ ఇంటినుంచి వచ్చిన తరువాత మా అత్తగారు అంతర్మథనం చేసుకున్నారట. అందులోంచి అమృతం వంటి ఆలోచన వచ్చిందట. ప్రతీ గృహస్తు ఈ కట్న వ్యవస్థకు గురి అవుతున్నాడు. ఆడపిల్లల జీవితాలు దుఃఖభాజనమౌతున్నాయి. తను కూడా అందుకు మినహాయింపు కాదు. ఆనాడు తన తండ్రి బాధపడ్డాడు. ఆ పిల్ల తీసుకున్న నిర్ణయంలో దోషమేముంది? ఇలా ఆడపిల్లలందరూ ఒక తాటిమీద నిలబడితే? వ్యవస్థ మారుతుంది. అయితే ప్రతి తల్లీదండ్రీ తమ మగపిల్లల వివాహవిషయంలో ఆదర్శాన్ని పాటించాలి.

తమకు ఏం తక్కువైంది? ఒకరిని నిలువు దోపిడీ చేస్తేనే కాని తమకాలం వెళ్ళదా? ఇలా ఆలోచించి ఆమె తన కుమారుడి పెళ్ళి కట్నకానుకలు తీసుకోకుండా చేయాలనే నిశ్చయానికి వచ్చారు. ఆనాడు నీవు వేసిన చురకే ఈ పరివర్తనకు కారణం అంటారు.

అయితే శంకరంగారు మరింత ఉదారంగా అతి బీదపిల్లను చేసుకుంటానన్నారు. గొప్పింటి పిల్ల అయితే ఆ డబ్బు వస్తురూపంగా ప్రవేశిస్తుంది. వారి అన్వేషణ రెండేళ్ళు పట్టింది. నా భాగ్యంలో అతను రాసి ఉన్నారు" అంది భారతి.

"మొత్తానికి వారిలో పరివర్తన కలిగిందంటావు?" అన్నాను.

నాకు సంతోషం కలిగింది.

భారతి ఆ షాపులో చీరా జాకెట్టుగుడ్డా కొంది కాబోలు, నాకిచ్చింది బొట్టుపెట్టి.

★ ★ ★

నా పెళ్ళి కాలేదన్న మావాళ్ళ ఆవేదన - గాడి తప్పిన నా జీవితం -

సుందరతరమైన భారతి జీవితం - నన్ను అశాంతికి గురిచేశాయి.

"అమ్మా! నేను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను" అన్నాను. అమ్మ ఆ మాటలతో సంతోషపడలేదు. "నువ్వు అనుకుంటే లాభం ఏమిటి? కట్నం ఇవ్వందే ఎవరుమాత్రం చేసుకుంటారు" అంటూ ఆవేదనను వ్యక్తం చేసింది.

"అమ్మా! ఏటికి ఎదురీదే ఓపిక నాకులేదు" అన్నాను. ఆమె ఆశ్చర్యపోయింది. ఆనందించింది. నన్ను ఆప్యాయంగా కౌగలించుకుంది.

భారతి వాక్కు యదార్థమైంది. శంకరం, అతని భార్య, వారిద్దరి తల్లిదండ్రులు మా పెళ్ళికి వచ్చారు. ఇంతలో బాబు లేచాడు. నా స్మృతులు గాలికి ఎగిరిపోయాయి. అతనెవరో అన్నట్లు అమ్మ కావాలనే కాంక్ష పెళ్ళికి మూలమా?

ఓం సహనావవతు సహనౌ భునక్తు
సహ వీర్యం కరవావహై
తేజస్వి నావధీత మస్తు మా విద్విషావహై
ఓం శాంతిః శాంతిః శాంతిః

(ఈ కథలోని మొదటి పేరాలోని వ్యాఖ్యలు శ్రీ గంధం వేంకాస్వామి శర్మగారి ఒక వ్యాసంలోనివి. వారికి కృతజ్ఞతలతో)

(స్వాతి మాసపత్రిక - అక్టోబరు 2001)